భవిత కేంద్రం.. దివ్యాంగులకు వరం

- ఆటపాటలతో ప్రత్యేకమైన విద్య
- అవసరాలకు తగ్గ మౌలిక సదుపాయాల కల్పన
- విద్యార్థులకు ఫిజియోథెరపీ



భవిత కేంద్రంలో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులు



భవిత కేంద్రంలోని ఫిజియోథెరపీ పరికరాలు

గుర్రంపోడు : దివ్యాంగ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన ప్రత్యేక తరహా విద్యతోపాటు వైద్యం సౌకర్యాలు అందించే భవిత విద్యా వనరుల కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండేలా ప్రభుత్వం సంకల్పించింది. గతంలో అంతంత మాత్రం సౌకర్యాలతో నడుస్తున్న ఈ కేంద్రాలపై ఈ ఏడు ప్రత్యేక దృష్టి సారించి బడులు తెరిచే నాటికి మౌలిక వసతులన్నీ సమకూర్చేలా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలకేంద్రంలో భవిత విద్యావనరుల కేంద్రంకు పక్కా భవనం ఉండగా దీన్ని మహిళా సమాఖ్య కార్యాలయంగా ప్రస్తుతం వినియోగిస్తుండటంతో మండల విద్యావనరుల కేంద్రానే భవిత కేంద్రంగా వినియోగించుకునేలా ఈ భవనానికి మౌలిక వసతులను దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకునేలా గా మరుగుదొడ్లు రెయిలింగ్‌తో కూడిన ర్యాంపును నిర్మిస్తున్నారు. విద్యార్థులను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా రంగురంగుల బొమ్మలతో గోడలను తీర్చిదిద్దనున్నారు.

భవిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్

జిల్లాలోని అన్ని భవిత కేంద్రాలకు ఇటీవల జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించగా మండలకేంద్రంలోని ఇక్కడి భవిత కేంద్రానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక అధికారిగా ఉన్నారు. దీంతో భవిత కేంద్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేలా సౌకర్యాలన్ని సమకూర్చుతున్నారు. జిల్లాలో ప్రతి మండలంలో భవిత కేంద్రానికి ప్రత్యేకంగా ఒక గదిని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసేలా అవసరమైన పనులు చేస్తున్నారు. జిల్లాలో గుర్రంపోడుతో పాటు మరో ఏడు మండలాల్లోనే భవిత కేంద్రాలు ప్రత్యేకంగా ఉండగా మిగతా అంతటా మండలకేంద్రాల్లో పాఠశాలల్లోనే ప్రత్యేకంగా తరగతి గదిని ఏర్పాటు చేసి భవిత కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు లేక కేంద్రాలకు దివ్యాంగ విద్యార్థులను క్రమం తప్పకుండా పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపక ఫిజియోథెరపీ నిర్వహించే రోజుల్లోనే విద్యార్థులు హాజరవుతున్నారని గుర్తించిన విద్యాశాఖ క్రమం తప్పకుండా విద్యార్థులు హాజరయ్యేలా మౌలిక వసతులు సమకూర్చుతుంది.

విద్యార్థుల్లో మార్పు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో విద్య, ఆరోగ్యంలో గణనీయమైన మార్పులు తీసుకురావడానికి వీలుంటుంది. వైకల్యంతో పాఠశాలలకు వెళ్లలేని వారికి ఈ కేంద్రంలో ఆరోగ్యపరమైన సేవలకు ఫిజియోథెరపిస్టు ద్వారా ఫిజియోదెరపీ ప్రతి నెలా నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరికి రవాణా భత్య చార్జీలు అందించడంతోపాటు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తారు. ప్రత్యేకమైన ఆటవస్తువులతో వీరికి ప్రత్యేక తరహా బోధన అందించనున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక లోపాలున్న విద్యార్థులకు ఈ భవిత కేంద్రంలో సేవలందిస్తారు. గుర్రంపోడు మండలంలో 48మంది దివ్యాంగ విద్యార్థులు ఉండగా ఆయా గ్రామ పాఠశాలలకు వెళ్లలేక వైకల్యం గల ఎనిమిది మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి ఈ భవిత కేంద్రంలో సేవలందించడం జరుగుతుంది.

భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలి



మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా దివ్యాంగ విద్యార్థుల తల్లి దండ్రుల తమ పిల్లలను కేంద్రానికి తీసుకునిరావాలి. భవిత కేంద్రంలో మౌలిక వసతుల్న బడి తెరిచే నాటికి పూర్తి చేసేలా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఐఈఆర్పీ దివ్యాంగ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య, ఫిజియోథెరపీ అందిస్తున్నాం. అవసరమైన వారి కి దృశ్య, శ్రవణ పరికరాలు, ట్రై సైకిళ్లు అందిస్తున్నాం.

– నోముల యాదగిరి, మండల విద్యాధికారి

అన్ని వసతులతో బీసీ డిగ్రీ గురుకుల కళాశాల

- ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : అన్ని వసతులు కలిగి ఉండేలా బీసీ డిగ్రీ గురుకుల కళాశాలను తయారు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నాగార్జునసాగర్ లోని పాత బీఈడీ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత బీఈడీ కళాశాల భవనాన్ని ప్రభుత్వ బీసీ డిగ్రీ గురుకుల కళాశాల భవనంగా మార్చుతున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీ స్కూల్ బ్రిడ్జిని, అవర్ బ్రిడ్జి చేయడానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే పనులను కూడా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా ఎంపీ రఘువీర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కళాశాలలో తాగునీటి వసతిని కల్పించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు తయారు చేశామని దానిని కూడా చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రవి కుమార్ మాద విలత, నాయకులు జంగయ్య, వేణు, హబీబ్, ఉంగరాల శ్రీను, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి : మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో అధిక ప్రయోజనాలు



రాగడపలో రైతులకు వ్యవసాయ సమాచార కరపత్రాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

త్రిపురారం : తొలకరి వర్షాలకు పొలం మొత్తాన్ని లోతు దుక్కులు దున్నుకోవడం వల్ల వివిధ రకాల పంటల సాగుకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని వరి పరిశోధన స్థానం, కంపాసాగర్ శాస్త్రవేత్త శివ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని రాగడప గ్రామంలో రైతు ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. విపరీతంగా రసాయన ఎరువులు వాడకుండా మట్టి పరీక్షలు చేయించుకొని వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పొలాల్లో సేంద్రియ ఎరువులైన పశుల ఎరువు, మేకలు, గొర్రెల ఎరువులు, చెరువు మట్టిని చల్లుకోవడంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటల మార్పిడి పాటిస్తు సాగు నీటిని ఆదా చేసుకోవాలన్నారు. అనంతరం పంటల సాగులోని పద్ధతులను సూచించే కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. శాస్త్రవేత్త సంధ్యారాణి, విస్తరణ అధికారి నాగరాజు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం



నిడమనూరు : రైతు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య



తిపురారం : బాబుసాయిపేటలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల

నిడమనూరు: భూ భారతి చట్టం–2025 లో భూ సమస్యలన్ని పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం–2025 తీసుకొచ్చిందని చెప్పారు. చట్టంలోని పలు అంశాలను రైతులకు వివరించారు. సదస్సులో 119 దరఖాస్తులు వచ్చాయి. అసైన్‌మెంట్ వివాదాలు 101, సర్వేనంబరు మిస్సింగ్ కేసులు–8, వారసత్వ(ఫౌతి)–6, ఇతరాలు 4 వచ్చాయి. ప్రధానంగా సదస్సుకు వారసత్వ, హద్దు పంచాయతీలు, భూములు ఎక్కువ, తక్కువ రికార్డుల్లో నమోదు కావడంతో వివాదాలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దాడి రాజిరెడ్డి, సందీప్, రెవెన్యూ సిబ్బంది సైదులు, జానర్ధన్ గౌడ్, అనిల్, పలువురు ఉద్యోగులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

త్రిపురారం : తెలంగాణ భూ భారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. గురువారం మూడో రోజు మండలంలోని బాబుసాయిపేట, బొర్రాయిపాలెం రెవెన్యూ గ్రామాల్లో అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రమీలా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐలు సైదులు, సంతోష్, మాజీ ఎంపీటీసీ గట్టు యాదగిరి, కస్తూరి ఆనంద్, గంగుల ఉపేందర్, ఉల్లెందుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి, గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ముత్యాలమ్మ అమ్మవారిని, బొడ్రాయిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండీ.యూసుఫ్, కుందూరు వీరకోటిరెడ్డి, ఆంగోతు హాతీరాంనాయక్, కటికం సైదులు, కర్ర సేవానాయక్, హనిమిరెడ్డి, సోము సైదిరెడ్డి, బాల సత్యనారాయణ, కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మిర్యాలగూడ : పూలే, సేవాలాల్ భవన్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు



నిడమనూరు : కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న న్యాయమూర్తి స్వప్న

మిర్యాలగూడ : ఎర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక జ్యోతిబా పూలే భవన్, సత్ సేవాలాల్ భవన్, అంబేద్కర్ భవన్‌ల పరిసరాల్లో ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. చెట్లే మానవ మనుగడకు ఆధారమన్నారు. రోజురోజుకు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా తమ పరిసరాల్లో వీలైనన్ని మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని చైతన్యనగర్ బోటింగ్ పార్క్ వద్ద గురువారం వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అమృత్ 2.0 మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ పోతేపాక బక్కయ్య, సీవో వెంకటేశ్వర్లు, మహిళా సంఘాల నాయకులు ఎస్. సరిత, నాగమణి, భాగ్యలక్ష్మి, సౌజన్య, భద్రకాళి, అక్కమ్మ, దుర్గమ్మ రేణుక, చిట్టేమ్మ తదితరులున్నారు.

కోర్టు ఆవరణలో..

అలాగే కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి జి. వేణు, సినియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్‌లు మొక్కలను నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, ట్రెజరర్ జి. సాయికుమార్, కె. శ్రీనివాస్‌రెడ్డి, యడవల్లి చంద్రశేఖర్‌రెడ్డి, గోదాల వెంకట్‌రెడ్డి, లింగయ్య, కొంక వెంకన్న, దూపాటి మట్టయ్య, బాణాల ఉమాశంకర్, ప్రసాద్, బీవీ రమణ, ఆంజనేయులు, దేవులపల్లి శ్రీనివాస్‌చారి, నాగరాజు, కిరణ్, వినోద్, స్వరాజ్యం, గంగా భవాని తదితరులున్నారు. అలాగే ఇంటర్నేషనల్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోఇంపాక్ట్ ఇంటర్నేషనల్ బోర్డు సభ్యులు నూనే సుదర్శన్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మామిడి సత్యనారాయణ, కోట సరిత, మామిడి రోజ, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నిడమనూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి టీ స్వప్న మొక్క నాటారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందన్నారు. సహజ వనరుల సంపదను రాబోయే తరాలకు అందిదమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఉన్నం చినవీరయ్య, కోర్టు ఉద్యోగులు ఉన్నారు.

ఈ సంవత్సరంలోనే కులగణన ప్రారంభించాలి

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం 2025లోనే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమైనట్లు కనిపిస్తుందని అన్నారు. త్వరలో నిర్వహించబోయే తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అధికారంలోకి రావడానికి బీసీ కులగణన అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి బీసీలపై ప్రేమ ఉంటే వెంటనే షెడ్యూల్‌ను సవరించి ఈ సంవత్సరంలోనే ప్రారంభించాలన్నారు. ఆలస్యం చేయడంతో ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నేతలు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, సుధాకర్, శేఖర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం



దామరచర్లలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

చింతపల్లి : ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన 'బడి బాట ప్రచార జాతా' కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య హాజరై ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం చింతపల్లి, వింజమూరు, కుర్మపల్లి, కుర్మేడు, మదనాపురం, మాల్, తదితర గ్రామాలలో ప్రచారాన్ని నిర్వహహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, ,జిల్లా కార్యదర్శి యాదగిరి, కస్తూరి బా ప్రిన్సిపాల్ వాసవి, ఎఫ్ డబ్ల్యూఎఫ్ సభ్యులు శ్రీరాములు, సీనియర్ సభ్యులు ఎర్ర శ్రీరాములు, కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షులు వెంకటేశం, లక్ష్మణ్, కృష్ణ, కొండలు, వరలక్ష్మి, తస్లీమ్, నర్సింహా, రామచంద్రం,తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం టీఎస్‌యుటీఎఫ్ ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాతా దామరచర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి చెలకపల్లి శ్యామ్‌కుమార్, పులి సత్యనారాయణ, బైరం శేఖర్, సట్టు రాము, రజబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

అడవిదేవులపల్లి : నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ప్రచార జాతా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉచిత విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరుగుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల కార్యదర్శి లోక్యనాయక్, పులి సత్యనారాయణ, శ్యాంకుమార్ తదితరులున్నారు.

రోడ్ల పక్కనే పెంటదిబ్బలు



ముసలమ్మచెట్టు గ్రామంలో రోడ్డు పక్కనే పోసిన పెంట దిబ్బలు



ఏనేమీదితండాలో రోడ్డు పై ఉన్న పెంటదిబ్బలు

పెద్దవూర : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కనే పెంటదిబ్బలు పోస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జయరాంతండా, ఏనేమీదిగూడెం, పెద్దగూడెం, పొట్టివానితండా, పూల్యాతండా, ముసలమ్మచెట్టు తదితర గ్రామాల్లో పెంటదిబ్బలను రోడ్డు పక్కనే పోస్తున్నారు. దీంతో పెంటదిబ్బలు జారి రోడ్డుపైకి వస్తుండటంతో పశువుల పెంట, గడ్డి అంతా రోడ్డును ఆక్రమిస్తున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలోనైతే వర్షానికి పెంటదిబ్బలు నానిపోయి దుర్వాసనను వెదజల్లుతాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పక్కన పెంటదిబ్బలు పోయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఎంఈఓ కృష్ణమూర్తి, పీఈటీలు

హాలియా : జిల్లా యువజన, క్రీడాశాఖ నల్లగొండ ఆధ్వర్యంలో నెల రోజులుగా హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దృఢంగా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కబడ్డీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. విద్యార్థులకు కబడ్డీ క్రీడలో శిక్షణ ఇచ్చిన శిక్షకుడు శనిగల ఎల్లయ్యను అభినందించారు. అనంతరం నల్లగొండ చంద్రయ్య, మంగమ్మ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లగొండ ఆంజనేయులు వేసవి శిక్షణలో పాల్గొన్న 30మంది విద్యార్థులకు కిట్లను బహూకరించారు. ఈ కార్యక్రమలో పీఈడీ వెంకట్రాంరెడ్డి, షేక్ జలీల్, వెంకటయ్య, అంజయ్య, షేక్ షరీఫ్, శ్రీను, పీఈటీలు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహమ్మద్ వహీద్, చంద్రశేఖర్ యాదవ్, లుకేందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు దొండ పందిరి దగ్ధం



దగ్ధమవుతున్న దొండ పందిరి

పెద్దవూర : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దొండ పందిరి దగ్ధమైన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం పెద్దవూర గ్రామానికి చెందిన కోట అంజి తనకున్న ఎకరంలో దొండకాయల సాగు చేస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు దొండ పందిరికి నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. దీంతో దొండ తీగతో పాటు డ్రిప్ పైపులు, మెయిన్ పైపులు మంటలకు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు వ్యాపిస్తుండడంతో గమనించిన రైతులు బాధిత రైతుకు ఫోన్‌లో సమాచారం అందించగా అక్కడికి వచ్చే సరికే సగానికి పైగా దగ్ధమైంది. పక్కనున్న రైతు బోరు నుంచి నీళ్లను బక్కెట్లతో తెచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.1.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

సీపీఐ మండల కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండల సీపీఐ మండల మహాసభ యాద్గార్‌పల్లిలోని ఎస్ఎన్‌డీ గార్డెన్‌లో నిర్వహించారు. అనంతరం 15మందితో మండల కౌన్సిల్‌ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు గురువారం ప్రకటించారు. మిర్యాలగూడ మండలానికి ఎండీ సయ్యాద్, అంజనపల్లి రామలింగం, బిల్లా కనకయ్య, గువ్వల మట్టయ్య, గోలి రమేష్, ఎర్రమాద శ్రీనివాస్‌రెడ్డి, ఎండి రహీం, లింగంపల్లి సైదమ్మ, యాదగిరి, దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, బంటు రాజే శ్వరీ, వెంకన్నలను ఎన్నుకున్నకోగా సీపీఐ మండల పార్టీ కార్యదర్శిగా అంజనపల్లి రామలింగంను ఎకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు బంటు తెలిపారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తక్షణమే తొలగించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యురాలు ఎర్రబోతు పద్మ, బంటు బుచ్చయ్య, అంజన్న, రామలింగం, బంటు రాజేశ్వరీ, సైదా తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

చింతపల్లి : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వీటి నగర్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్‌లో 11 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, మైనర్లకు వాహనాల అప్పగించిన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: పట్టణంలో నివాస స్థలాలు లేకుండా జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి సైదిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి లెనిన్, ముత్యాలు, రామచంద్రరాజు, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ ప్రారంభం

నల్లగొండ: ఇటీవల పానగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మారెడ్డి శిల్ప మృతిపై పోలీసులు గురువారం విచారణ ప్రారంభించారు. వారం రోజుల క్రితం పానగల్‌లో వాకింగ్ చేస్తుండగా శిల్పను బైక్ ఢీకొనడంతో చికిత్స పొందుతూ ఆదివారం హైదరాబాద్ లోని ఆస్పత్రిలో మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఇందులో పోలీసు అధికారి ప్రమేయం ఉందని ఆరోపిస్తూ శిల్ప భర్త మారెడ్డి ప్రశాంత్‌రెడ్డి టూటౌన్ సీఐ, ఎస్ఐ, ఎస్పీకి వినతి పత్రం అందజేశాడు. ఈమేరకు విచారణ ప్రారంభించినట్లు టూటౌన్ ఎస్సై సైదులు తెలిపారు.